andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.6, కనిష్ఠం 23.2



నిర్మల్
జిల్లా వార్తలు

ఆదివారం 17 మార్చి 2024

రేపటి నుంచి పది పరీక్షలు



నిర్మల్ కల్చరల్, మార్చి 16 : జిల్లాకేంద్రంలో పదోతరగతి పరీక్షలు ఈ నెల 18 సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 30 వరకు కొనసాగుతాయి. గత ఏడాది పది ఫలితాల సాధనలో జిల్లా 99 శాతంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈసారి ఆ స్థానం నిలబెట్టుకునే దిశగా విద్యాశాఖ పట్టుదలతో ఉంది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేక ఆదేశాలతో విద్యార్థులకు ప్రత్యేకబోధనపై దృష్టిసారించి ప్రీ ఫైనల్ పరీక్షల వరకు విద్యార్థులకు బోధన కొనసాగించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టి చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పరీక్షలకు సిద్ధం చేశారు.

- జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 47 పరీక్ష కేంద్రాలు.. 8,923 మంది విద్యార్థులు
- సిబ్బంది నియామకం.. గట్టి బందోబస్తు
- కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం
- సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్

జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పదోతరగతి పరీక్షల నిర్వహణకు గాను జిల్లావ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 23 ఎ సెంటర్లు, 17 బి సెంటర్లు, 7 సి సెంటర్లు ఉన్నాయి. నిర్వహణ కోసం 47 మంది సీఎస్‌లు, 47 మంది డీవోలు, ఏడుగురు కస్టోడియన్లను నియమించారు. ఉదయం 9 :30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష జరుగుతుంది. భౌతిక, జీవ శాస్త్రంకు రెండు విడివిడిగా పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తారు.

హాజరు కానున్న 8,923 మంది విద్యార్థులు

పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,923 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. 6,050 మంది 156 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 2,873 మంది 230 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో 4,309 బాలురు కాగా 4,614 మంది బాలికలున్నారు.

పకడ్బందీగా నిర్వహణకు ప్రత్యేక బృందాలు


పరీక్షలను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీపరీక్ష కేంద్రంలో ఒక సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుంది. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రతినిత్యం పరీక్షకేంద్రాలు తనిఖీ చేస్తాయి. ఎలాంటి కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్లు, ఏఎస్సైలు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ఉన్నారు.

కేంద్రాల్లో సౌకర్యాలు.. సీసీ కెమెరాల ఏర్పాటు

పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ఆదేశించారు. త్రాగునీటి వసతి, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నిచర్ తగిన విధంగా సమకూర్చేలా చర్యలు తీసుకున్నారు. మెడికల్ సిబ్బందిని నియమించి ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి నిఘా మధ్య పరీక్షల నిర్వహణ ఉంటుంది. విద్యుత్ శాఖ అధికారులు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలిచ్చారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి ఉండేలా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక కేంద్రాల పరిధిలో భద్రతా సిబ్బందిని అధికసంఖ్యలో అందుబాటులో ఉంచేలా పోలీసుశాఖను ఆదేశించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో, అధికారులు

సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్

పది పరీక్షలకు సంబంధించిన వివరాలు తెలుసుకొని సందేహాలు నివృత్తికి గాను టోల్ ఫ్రీ నెంబర్ 9059987730 ఏర్పాటు చేశారు. కేంద్రాల్లోకి విద్యార్థులు, పరీక్ష సిబ్బంది మొబైల్ ఫోన్లు అనుమతించకుండా ఆదేశించారు.

పరీక్షల టైం టేబుల్

ఈ నెల 18న ఫస్ట్ లాంగ్వేజ్, 19న సెకండ్ లాంగ్వేజ్, 21న థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్), 23న గణితం, 26న సైన్స్ పార్ట్-1 భౌతికశాస్త్రం, 28న సైన్స్ పార్ట్-2 జీవశాస్త్రం, 30న సాంఘికశాస్త్రం పరీక్ష నిర్వహిస్తారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సుల నిర్వహణ

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేలా ఆదేశాలిచ్చారు. విద్యార్థులు కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

● డీఈవో రవీందర్‌రెడ్డి



పదో తరగతి పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తాం. అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. 144 సెక్షన్ ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయి. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

దేవరకోటలో పల్లకీ సేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ కల్చరల్, మార్చి 16 : నిర్మల్‌లోని దేవరకోట లక్ష్మీ వెంకటేశ్వరాలయంలో శనివారం ఉదయం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామివారిని పల్లకీలో వేంచేపు చేసి పల్లకీసేవ నిర్వహించారు. గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు రాజేశ్వర్, దేవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోరిక మేరకు రోడ్లపై దుమ్ము తొలగిస్తున్నాం

● ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ



రోడ్లపై ఎయిర్ బ్లోయర్ సహాయంతో దుమ్ము తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

ఖానాపూర్, మార్చి 16 : ప్రజల కోరిక మేరకే పట్టణంలో రోడ్లపై ఉన్న దుమ్మును తొలగించే ప్రయత్నం చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్య నారాయణ అన్నారు. శనివారం ఉదయం పట్టణంలో రోడ్లపై పేర్కొన్న దుమ్ము ధూళిని ఎయిర్ బ్లోయర్ సహాయంతో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా పనులను పర్యవేక్షించిన చైర్మన్ సత్యనారాయణ ఖానాపూర్ పట్టణంలో రోడ్లపై తీవ్రంగా మట్టి పేరుకుపోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ధూళి అధికంగా వస్తుందని పలువురు ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎయిర్ బ్లోయర్ల సహా యంతో రోడ్లపై ఉన్న దుమ్ము ధూళి తొలగిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్నారపు శంకర్ ఉన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 16 : మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, శ్రమ దోపిడీ అరికట్టాలని కోరుతూ శనివారం ఏవోకు కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ... కడెం ప్రాజెక్టు పీఎల్ఆర్ కంపెనీ వాటర్ సప్లై కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. 16 వేలకు బదులు 8 వేలు చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి నూతన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అందకూర్ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి

అందకూర్‌లో పశువైద్యశిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుంటాల, మార్చి, 16: మండలంలోని అందకూర్ గ్రామంలో గత కొద్ది రోజులుగా పశువులకు గాలికుంటు వ్యాధిసోకి బాధ పడుతున్నట్లు శనివారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమవ్వగా జిల్లా పశువైద్యాధికారి గంగాధరయ్య ఆధ్వర్యంలో శనివారం అందకూర్ గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇది వరకు గాలికుంటు వ్యాధి సోకని పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. వ్యాధి సోకిన పశువులకు అవసరమైన మందులను అందజేశారు. పశువైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, పశుపోషకులు అధైర్య పడవద్దని, పశువులకు ఎలాంటి వ్యాధులు సోకిన నివారించేందుకు తమవంతు కృషి చేస్తామని జిల్లా పశువైద్యాధికారి గంగాధరయ్య తెలిపారు.

'రాజీ'లో పట్టింపులొద్దు

● విలువైన సమయం, ధనాన్ని వృథా చేసుకోవద్దు
● లోక్ అదాలత్‌లో 1167 కేసుల పరిష్కారం
● భైంసా న్యాయాధికారి దేవేంద్రబాబు



భైంసా లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి దేవేంద్రబాబు

భైంసా, మార్చి 16 : కేసుల పరిష్కారం విషయంలో పట్టింపులకు పోయి ఆర్థికంగా నష్టపోవద్దని భైంసా న్యాయాధికారి దేవేంద్రబాబు కక్షిదారులకు సూచించారు. భైంసా కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలు, నిరాక్షరాస్యులు చట్టాలపై అవగాణ లేక ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కొన్ని రకాల కేసులు సంవత్సరాల కాలం పాటు కొనసాగడంతో జీవితంలో విలువైన సమయాన్ని, ధనాన్ని కోల్పోతున్నారని, కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు.. దీంతో వారి పిల్లలు, కుటుంబ సభ్యులు సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. నేరాలకు పాల్పడే ముందు ఒక్కసారి కుటుంబాన్ని గుర్తుచేసుకోవాలని సూచించారు. తప్పు చేసిన వారికి ఎట్టి పరిస్థితిల్లోనూ శిక్ష తప్పదని హెచ్చరించారు. నేరాల చేసి కారాగారాలకు వెళ్లడం, జైళ్లలో సంవత్సరాల పాటు మగ్గిపోవడం జీవితానికే పెద్ద మచ్చగా మిగులుతుందని తెలిపారు. వివిధ కారణాలతో కోర్టులో ఎన్నో కేసులు పరిష్కారాని నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి వాటికి లోక్ అదాలత్ చక్కని పరిషార మార్గమని స్పష్టంచేశారు. కక్షిదారులు పట్టింపులకు పోకుండా లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలన్నారు. కోర్టులో ఇచ్చే తీర్పుతో కక్షిదారుల్లో ఎవరో ఒక్కరే గెలుస్తారని లోక్ అదాలత్‌తో ఇద్దరు గెలుస్తారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ పడడం సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని తెలిపారు. ఈ సదర్భంగా లోక్ ఆదాలత్‌లో రికార్డు స్థాయిలో 1167 కేసులు పరిష్కరించబడగా రూ.7.19 లక్షల రూపాయలు రికవరి చేసారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముథోల్, మార్చి 16 : మండల కేంద్రమైన ముథోల్‌లో ఆదివారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు (రెండు గంటలు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

● ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం ● అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ పోలింగ్ శాతం నమోదు చేయడమే లక్ష్యంగా శ్రమించాలి ● జిల్లాలో మొత్తం 7,34,828 మంది ఓటర్లు ఉన్నారు ● జిల్లా వ్యాప్తంగా 922 పోలింగ్ కేంద్రాలు ● 50 వేల కంటే ఎక్కువ నగదు కలిగి ఉంటే తగిన ఆధారాలు చూపాల్సిందే ● జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నిర్మల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైందన్నారు. ఏప్రిల్ 18వ తేదీన ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 78 శాతం పోలింగ్ జరిగిందన్నారు. ప్రస్తుతం రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం 85 నుంచి 90 శాతం నమోదయ్యేలా పనిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 7,34,828 ఓటర్లు ఉండగా ఖానాపూర్ నియోజకవర్గంలో 2,23,783, నిర్మల్ నియోజకవర్గంలో 2,57,248, ముథోల్ నియోజకవర్గంలో 2,53,793 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. 85 ఏళ్లకు పైబడిన ఓటర్లు 4,011 ఉండగా మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు 7,000 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 922 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఖానాపూర్ నియోజకవర్గంలో 305, నిర్మల్ నియోజకవర్గంలో 306, ముథోల్ నియోజకవర్గం 311 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. 50 శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ఏడు అంతర్‌రాష్ట్ర సరిహద్దులు ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే వివిధ పోర్టర్లలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీ విజిల్ యాప్, 1950కి డయల్ చేసి ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేలకు మించి నగదును కలిగి ఉంటే కచ్చితంగా ఆధారాలు చూపించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పని చేయాల్సి ఉంటుందన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టండి

పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సెక్టార్, రూట్, పోలీసు అధికారులకు ఎన్నికల నిర్వహణ, శిక్షణపై సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలు కాగానే ప్రభుత్వ కార్యాలయాల్లో ఎటువవంటి రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు ఉండకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగ ఓటర్లకు ర్యాంప్ సౌకర్యం కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సౌకర్యం, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ తక్కువైన కేంద్రాలు గుర్తించి పోలింగ్‌శాతం పెంచేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు రూపొందించిన సి విజిల్ యాప్, ఎన్నికల టోల్ ఫ్రీ 1950 నెంబర్‌పై ఓటర్లకు తెలియజేయాలన్నారు. షాడో పోలింగ్ కేంద్రాల్లో నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి టెలికాం అధికారులను సమన్వయం చేసుకొని శాటిలైట్ ఫోన్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు పదిరోజుల్లో రూట్ మ్యాప్ అందజేయాలన్నారు. ఈవీఎంల పనితీరుపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల ముందు రోజు కేంద్రాలకు 200ల మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలు ఉండకుండా చూడాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో 90 నిమిషాల ముందు 50 ఓట్లకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. సెక్టార్ అధికారులు కనీసం మూడుసార్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్నికల సరళిని పరిశీలించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు, ఈవీఎంలకు పటిష్ఠ భద్రత కల్పించాలని పోలీస్ శాఖకు సూచించారు. సమన్వయంతో పని చేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. 12 డి ఫారంపై అధికారులకు సమాచారం అందజేశారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యల జోలికి వెళ్లొద్దు

● ఎస్పీ జానకి షర్మిల

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాజకీయ పార్టీ నాయకులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ కలిగి ఉండాలన్నారు. కుల మతాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయవద్దన్నారు. లైసెన్స్ ఉన్న తుపాకులను వెంటనే యజమానులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని ఆదేశించారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, భైంసా ఏఎస్పీ క్రాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీపీఆర్వో విష్ణువర్ధన్, తదితరులున్నారు.

బస్సు డిపో ముందు మహిళల రాస్తారోకో



బస్ డిపో ముందు ధర్నా చేస్తున్న మహిళలు

సారంగాపూర్, మార్చి 16 : మండలంలోని మలక్ చించోలి గ్రామానికి చెందిన మహిళలు శనివారం జిల్లాకేంద్రంలో గల ఆర్టీసీ బస్సు డిపో ముందు రాస్తారోకోను నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఆర్టీసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న మహిళలను వివరాలు అడిగి తెలుసుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినప్పటికీ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇతర గ్రామాలకు రాకపోకలను కొనసాగించాలంటే ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. మలక్ చించోలి గ్రామానికి ప్రతి రోజు గంటకు ఒక్కసారి బస్సు రాకపోకలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాలకు ప్రయాణించాలంటే ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. మలక్ చించోలి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలు ఉచిత ప్రయాణాన్ని కొనసాగించవచ్చని ఆర్టీసీ అధికారులు మహిళలకు హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగారు.

సంక్షిప్త సమాచారం

బొలెరో వాహనం ఢీకొని బాలిక మృతి

దిలావర్‌పూర్, మార్చి 16 : మండలంలోని కంజర్‌లో విషాదం చోటుచేసుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యం... ఓ చిన్నారి ప్రాణాన్ని గాలిలో కలిపేసింది. దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం... దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ఓ గ్యాస్ ఏజెన్సీకి చెందిన బొలెరో వాహనం డోర్ డెలివరీ చేసేందుకు సిలిండర్ల లోడుతో కంజర్ గ్రామానికి వెళ్లింది. బొలెరో వాహనం డ్రైవర్ వెనక ముందు చూసుకోకుండా వాహనాన్ని వేగంగా నడపడంతో రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారి అనియా ఫాతిమా (15 నెలలు) పాప తల పైనుంచి వెళ్లడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. వాహనాన్ని అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి చిన్నారి ప్రాణాలు పోయేందుకు కారణమైన డ్రైవర్ కొత్తిమీరి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమాంజలి తెలిపారు. కాగా చిన్నారి మృతితో తల్లిదండ్రులు విలపించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

జాఫ్రాపూర్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

నిర్మల్ కల్చరల్, మార్చి 16 : సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది జాఫ్రాపూర్ గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇటీవల విషజ్వరాలు సోకినందున ఈ వైద్య శిబిరం నిర్వహించాలని ఎంపీపీ ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి పరీక్షించారు. ఈ శిబిరంలో ఎంపీపీ మానస హరీష్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, యూత్ పాల్గొన్నారు.

నేడు టి-10 ఎంపిక పోటీలు

నిర్మల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం లోని గాయత్రి టౌన్ షిప్‌లోని లక్కీ అకాడమీలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి టి-10 ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ సందీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుండి 24 వరకు జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన వారు లక్కీ అకాడమీ డైరెక్టర్ సుదర్శన్‌ను 8106108335 నెంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

19న తైబజార్ వేలం

ఖానాపూర్, మార్చి 16 : పట్టణంలోని తైబజార్ వేలం ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు కమిషనర్ పురపాలక సంఘం ఖానాపూర్ పేరిట రూ. రెండు లక్షలు డీడీ తీసి మున్సిపల్ కార్యాలయంలో 18వ తేదీ సాయంత్రం లోపు అందజేయాలన్నారు. ప్రతి ఆదివారం, బుధవారాల్లో జరిగే వార సంత (తైబజార్) బహిరంగ వేలం తాలూకు వేలం పాట 19వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మనోహర్ కోరారు.







ఎన్నికల కోడ్‌తో ఖానాపూర్‌లో ఫ్లెక్సీల తొలగింపు




ఖానాపూర్‌లో రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఖానాపూర్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ శనివారం వెలువడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నిబంధనలను పక్కా అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శనివారం నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఖానాపూర్ పట్టణంలో ఉన్న ఆయా రాజకీయ పార్టీల నాయకులకు చెందిన ఫ్లెక్సీలన్నింటినీ తొలగించారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్ పట్టణంలో ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియను పర్య వేక్షించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ఎటువంటి ఫ్లెక్సీలు గానీ బ్యానర్లు గానీ ఏర్పాటు చేయవద్దని ఆయన సూచించారు.











స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి

● మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ● మిషన్ భగీరథ అధికారుల తీరుపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు

తలమడుగు, మార్చి 16: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పరంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో స్థానిక నాయకులకే ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులకు ప్రాధాన్యత ఇస్తే ఊరుకునేది లేదని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మిషన్ భగీరథ అధికారుల పై మండిపడ్డారు. శనివారం మండలకేంద్రంలోని మండల అధ్యక్షురాలు కళ్యాణంలక్ష్మి రాజేశ్వర్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యల కింద నిధులు మంజూరు చేస్తున్నప్పటికి ఆ పనులు చేసేందుకు స్థానిక నాయకులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇతర ప్రాంతాల వారికి పనులను ఇస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, మిషన్ భగీరథ అధికారుల పై జడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రత్యేక అధికారులు చొరవ చూపి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారివారి నివేదికను ప్రజాప్రతినిధులకు విన్నవించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని జడ్పీటీసీ కోరారు. వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు పరుస్తున్నామన్నారు. వాటిలో కచ్చితంగా మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమో జారీ చేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. ఇందులో ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శేఖర్ వైస్ ఎంపీపీ దివ్య, పశువైద్యాధికారి దూద్‌రాం రాథోడ్, పీఆర్ ఏ మదర్, వైద్యాధికారి డాక్టర్ హరీష్, విద్యుత్ శాఖ ఏఈ సతీష్, ఐకేపీ ఏపీఎం స్వామి, ఈజీఎస్ ఏపీవో మేఘమాల, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీటీసీ

పొన్నారి పంచాయతీ తనిఖీ

తాంసి, మార్చి 16: మండలంలోని పొన్నారి గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి శనివారం ఎన్.శ్రీలత ఆకస్మికంగా సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివిధ రికార్డులను పరిశీలించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ట్యాక్స్ కలెక్షన్స్‌పై ఆరా తీశారు. వంద శాతం ట్యాక్స్‌ను వసూలు చేయాలని సూచించారు. ఆమె వెంట ప్రత్యేక అధికారి తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీవో సుధీర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి విజయ్, తదితరులు ఉన్నారు.

ముగిసిన బాజీరావు బాబా సప్తాహం

జైనథ్, మార్చి 16: మండలంలోని మేడిగూడ(ఆర్) గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న బాజీరావు బాబా సప్తాహం వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో డప్పులు భాజాలు, భజనల మధ్య బాజీరావు బాబా పల్లకీతో పాటు వివిధ దేవతా మూర్తుల వేషాధారణల మధ్య చిన్నారులను ఎడ్లబండిపై ఊరేగించారు. మహిళలు సంప్రదాయక నృత్యాలు చేశారు. బాబా భక్తుడు కుర్సంగే విలాస్‌రామయణ మహాభారతం మొదలగు ఉపనిషత్తులపై మహిళలు భక్తులకు సంకీర్తనను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ సర్పంచ్ సీమాశ్యాంసుందర్, వీడీసీ అధ్యక్షుడు క్యాతం రాంరెడ్డి, కోశాధికారి అడెల్లు, భక్తులు పాల్గొన్నారు.

'గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి'

బజార్‌హత్నూర్, మార్చి16: మండలంలోని పశపోశకులు, రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేయించాలనా డాక్టర్ పర్వేజ్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని బలన్‌పూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా గాలికుంటూ టీకాలను అందిస్తోందని. రైతులు, పశుపోశకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్ర మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిహత్నూర్: పశు పెంపకందారులు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను తప్పకుండా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ జీవన్ అన్నారు. శనివారం మండలంలోని శాంతాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ భారత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు పశు పోషణపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో, ఎంపీడీవో

నర్సరీలను పరిశీలించిన డీఆర్‌డీవో

సిరికొండ, మార్చి 16: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్డీవో) జి.సాయన్న సూచించారు. సిరికొండ మండలంలోని సోంపెల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో నాటిన మొక్కలను త్వరితగతిన పెంచి సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాల గంగాధర్, ఏపీవో భీంరావ్, మాజీ సర్పంచ్ కదం సూర్యకాంత్, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి'

తాంసి, మార్చి 16: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా శనివారం తాంసి జిల్లా పరిషత్ పాఠశాలలలో ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల కంటే ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధిస్తే మంచి ఫలితలు సాధ్యమవుతాయని ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు.

చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మార్చి 16: చెక్‌డ్యాముల నిర్మాణంతో భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. శనివారం మండలంలోని శ్యాంనాయక్‌తండా, హర్కపూర్‌ల వద్ద రూ.3.20 కోట్లతో మంజూరు చేసిన చెక్‌డ్యాముల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న వాగుల్లో నీళ్ల వరద పాలు అవుతున్నాయని ఎక్కడో దూరంలో ఉన్న ప్రాజెక్టులకు నీళ్లు చేరుతున్నాయని అన్నారు. అలాగే దొంగచింతలో రూ.2లక్షల రాష్ట్ర అభివృద్ధి నిధులతో కొత్త బోరు ఏర్పాటుకు టెంకాయ కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్రజైవంత్‌రావు, ఇరిగేషన్ డీఈఈ రాథోడ్ వినోద్, జాదవ్‌హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి కృషి'

గుడిహత్నూర్, మార్చి 16: నియోజకవర్గాన్ని అన్ని రంగల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని బెల్లూరి-తేజాపూర్, గర్కంపేట్ న్యూ సోమార్‌పేట్ గ్రామాలకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్న నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సంక్షేమంలో ముందుండే విధంగా చేస్తానన్నారు. ఇందులో ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, తోషం ఎంపీటీసీ సాగిర్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు నీలదేవి, తిరుమల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

నేరడిగొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. 8వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ ఇంటర్ (బాలికల)జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించగా గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ప్రతిభ కనబర్చి జిల్లా పేరును రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఇందులో ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు సాబ్లె నానక్‌సింగ్, రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్, పండరి, తదితరులు పాల్గొన్నారు.

'క్రీడా పాఠశాలలతో సత్ఫలితాలు'

ఉట్నూర్, మార్చి 16: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదర్శ క్రీడా పాఠశాలలో సత్ఫలితాలు వస్తున్నాయని పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం క్రీడా మైదానంలో ఆదర్శ క్రీడా పాఠశాలల ప్రవేశం కోసం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ క్రీడా నైపుణ్యాలు నేర్పిస్తూ జాతీయ స్థాయి క్రీడా పోటీలలో గిరిజన విద్యార్థులు పాల్గొంటున్నారని అన్నారు. జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి మాట్లాడుతూ క్రీడా ప్రతిభ పోటీల్లో ఎంపికైన విద్యార్థుల జాబితాను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తకు సమర్పించిన అనంతరం తుదిజాబితాను ప్రకటిస్తామన్నారు. వీరి నుంచే హైదరాబాద్‌లో ఈ నెల 18న జరిగే వాటర్ స్పోర్ట్స్ అకాడమి ప్రవేశాల కోసం పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో క్రాంతికుమార్, క్రీడా పాఠశాల హెచ్‌ఎం రాథోడ్ ఉత్తమ్, వ్యాయామ ఉపాధ్యాయులు జాదవ్ హేమంత్‌నాయక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాంసి, మార్చి 16: తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ మలపతి స్వామి శుక్రవారం రాత్రి పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో లారీ కంటైనర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటినా రిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు స్వామి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అటు తోటి ఉద్యోగులతో పాటు గ్రామస్తులతో కలివిడిగా ఉండే స్వామి మృతి అందరినీ కలిచివేసింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీలను గ్రామస్థులు అడ్డుకోగా, దానికి సంబంధంచి వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజకీయ పార్టీలు నిబంధనలను పాటించాలి : నిర్మల్ కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 16 : రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అనంతరం రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ ర్యాలీలు, సమావేశాలు, ఇతరత్రా వాటికి అధికారుల అనుమతులు తప్పనిసరి అన్నా రు. వ్యక్తిగత దూషణ చేయరాదని, డీజేలు నిషేధమని స్వీయ నియంత్రణ కలిగి ఉండాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, భైంసా ఏఎస్పీ క్రాంతిలాల్ పాటిల్, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో నిర్మల్ కలెక్టర్, ఎస్పీ

ఎన్నికలే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలి

● ముథోల్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

లోకేశ్వరం, మార్చి 16 : రానున్న పార్లమెంట్ ఎన్నికల గెలుపే లక్ష్యంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ముథోల్ నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం లోకేశ్వరంలో ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాటాడారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఎవరికి టికెట్ వచ్చిన గెలుపే లక్ష్యంగా కలిసి అందరూ పని చేయాలన్నారు. మండలం నుంచి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పండరి గౌడ్, ప్రధాన కార్యదర్శి సుధీర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు, యూత్ ఉపాధ్యక్షులు నరేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్రన్న, మైనార్టీ అధ్యక్షులు మౌలానా, మాజీ సర్పంచ్‌లు సంగం నర్సయ్య, దడిగే రాజేశ్వర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో అభివృద్ధి పనులకు భూమిపూజ

లక్ష్మణచాంద, మార్చి 16 : మండల కేంద్రంలోని చౌరస్తాలో రూ. 5 లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు శనివారం భూమి పూజ నిర్వహించారు. నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు కృషితో ఈ నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ. 30 లక్షల నిధులు మంజూరైనట్లు గుర్తు చేశారు. ఈ నిధులు మంజూరు చేయడానికి కృషి చేసిన శ్రీహరిరావుకు, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, అట్ల రామ్ రెడ్డి, రవికిరణ్, బిట్లింగ్ నారాయణ, సమ్మెట రవి, సిరిపురం నగేష్, సురేష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణచాందలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

రాజకీయ కుతంత్రంతోనే కవిత అరెస్టు

● బీఆర్ఎస్ ఖానాపూర్ మండల అధ్యక్షులు రాజ గంగన్న


విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజ గంగన్న

ఖానాపూర్, మార్చి 16 : నరేంద్రమోదీ, రేవంత్‌రెడ్డిల రాజకీయ కుతంత్రంలో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని ఆ పార్టీ మండల అధ్యక్షులు రాజగంగన్న ఆరోపించారు. శనివారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలను అణచి వేసేందుకు కేంద్రప్రభుత్వం తన ఆధీనంలో ఉన్న ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి సంస్థలను ఉపయోగిస్తుందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు రహస్య ఒప్పందంతో ముందుకు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వందరోజుల పాలన వైఫల్యాలను తెరపైకి రాకుండా ప్రజల దృష్టిని ఎమ్మెల్సీ కవిత అరెస్టు వైపు మళ్లించేందుకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం వారు కేంద్ర ప్రభుత్వం కలిసి ఈ కుట్ర పన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, గౌరీకర్ రాజు తదితరులున్నారు.

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


కల్వర్టు పనులకు భూమిపూజ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

పెంబి, మార్చి 16 : పెంబి మండల కేంద్రంలో 10 లక్షల ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న కల్వర్టు పనులకు శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, తులాల శంకర్, గుగ్గిళ్ల భూమేష్, స్వామి, మహేందర్, పుప్పాల నర్సయ్య, రాజలింగు, ఏపీవో రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి, చారి, హిందు, హుస్సేన్, తదితరులు ఉన్నారు.

పీచర ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీమాత విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, మార్చి 16 : మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2018 నుంచి 2023 వరకు ఉపాధ్యాయుడిగా, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తించిన మిట్టపెల్లి నర్సయ్య పాఠశాల, విద్యార్థులపై ఉన్న ప్రేమాభిమానాలతో పాటు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తన సొంత నిధులు రూ.1 లక్ష వ్యయంతో చదువుల తల్లి శ్రీ సరస్వతీ దేవి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో తాను ఇక్కడ పని చేసే సమయంలో ఇచ్చిన మాట ప్రకారంగా అమ్మవారి విగ్రహాన్ని విరాళంగా అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులతో పాటు పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు సాయి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనగా విగ్రహాన్ని విరాళంగా అందజేసిన మిట్టపెల్లి నర్సయ్య ప్రస్తుతం కుంటాల మండలంలోని లింబా(కె) ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఘనంగా పోషణ పక్వాడ



కుంటాల, మార్చి 16: కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామంతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద పాల్గొని మహిళలు, గర్భిణీలు, బాలింతలు, తదితరులకు పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. ప్రతీ మహిళా పోషకాహారం తీసుకుంటేనే ధృడంగా ఉంటుంది కావున ప్రభుత్వం అందజేస్తున్న పోషకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.8, కనిష్ఠం 23.7
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 17 మార్చి 2024





మోగిన లోక్‌సభ.. నగారా

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల
- నామినేషన్లకు ఆఖరి గడువు ఏప్రిల్ 25
- మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ
- ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- అభ్యర్థుల ఎంపికకు జిల్లాలోని రాజకీయ పార్టీల కసరత్తు
- సమరానికి సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 16 లక్షల 44వేల 715 ఓటర్లు

ఆదిలాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేందుకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి రానుందని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అధికారుల బదిలీలను పూర్తి చేసినా.. ఎన్నికల కమిషన్ సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేపడుతోంది. ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. మే13న ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆదిలాబాద్, సిర్పూర్, నిర్మల్, ఖానాపూర్, ఆసిఫా బాద్, బోథ్, ముథోల్ 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిపి అదేరోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే ఏప్రిల్ 25వరకు నామినేషన్ ప్రక్రియను చేపడుతారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు గడువు ముగియనుంది. దేశవ్యాప్తంగా 7దశల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా.. నాల్గవ దశలోనే జిల్లా పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. 2019లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 14లక్షల 78వేల 662 మంది ఓటర్లు ఉండగా.. ఈసారి 16 లక్షల 44వేల 715 గడిచిన ఐదేళ్లలో సుమారుగా లక్షా 66వేల 53 పైగా ఓటర్లు నమోదు కావడం గమనార్హం. ఈసారి పోలింగ్ ప్రక్రియంత ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారానే చేపట్టనున్నారు. మొత్తానికి 45 రోజుల గడువు లోపే ఈ ఎన్నికలు పూర్తికానున్నాయి.



ఇటీవల జిల్లాకేంద్రంలో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం (ఫైల్)

ముమ్మర ఏర్పాట్లు

జిల్లాలో గత కొద్ది రోజులుగా స్థానిక అధికారులు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యుల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. గత రెండు రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ రాజార్షిషా రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా ఎస్పీ గౌస్ ఆలాంతో కలిసి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. గతంలో ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో 1500 మంది ఓటర్లు ఉండేవారని, ప్రస్తుతం 1600 మంది ఓటర్లకు పెంచడం జరిగిందని తెలిపారు. ఈసారి 85ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. దీనికి గాను ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఓటర్ జాబితాను సవరించి తుదిజాబితాను సిద్ధం చేశారు. అలాగే పోలీసు శాఖ సైతం సిబ్బందిని ఎన్నికలకు సమయత్తం చేస్తోంది. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర అధికారులతో సమావేశాలు కూడా ఏర్పాటు చేసి పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్	119154	124375	06	2,43,535
సిర్పూర్	114484	114359	12	2,28,855
ఆసిఫాబాద్	112510	114056	16	2,26,582
ఖానాపూర్	109333	114437	13	2,23,783
బోథ్	102333	108580	02	2,10,915
నిర్మల్	121527	135702	19	2,57,248
ముథోల్	123234	130545	18	2,53,797
మొత్తం				16,44,715

.. నియోజకవర్గాల వారీగా సర్వీస్ ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
సిర్పూర్	281	09	290
ఆసిఫాబాద్	112	02	114
ఖానాపూర్	416	03	419
ఆదిలాబాద్	225	03	228
బోథ్	540	08	548
నిర్మల్	241	02	243
ముథోల్	270	03	273
మొత్తం			2115

సన్నద్ధమవుతున్న పార్టీలు

లోక్‌సభ ఎన్నికలు జరుగడం ఖాయమని ముందుగానే భావించిన ప్రధాన పార్టీలు ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నాయి. షెడ్యూల్ ఖరారు కావడంతో మరింత స్పీడును పెంచుతున్నాయి. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ కసరత్తును మొదలు పెట్టింది. బీజేపీ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీ గోడం నగేష్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సక్కుల అభ్యర్థిత్వం ఖరారైంది. దీంతో కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించింది. ఒకటి, రెండు రోజుల్లోనే అభ్యర్థిని ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. ఓ అడుగు ముందుకేసిన బీజేపీ ఇప్పటికే సంకల్ప యాత్రను చేపట్టి ఆదిలాబాద్, ఇచ్చోడ, నేరడిగొండ, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో రోడ్‌షోలను నిర్వహించింది. అలాగే జిల్లాకేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించింది. జిల్లా నుంచే ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా ఇంద్రవెల్లిలో బహిరంగ సభను నిర్వహించి లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసింది. ఇటీవలే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సమక్షంలో ప్రత్యేక సమావేశమై లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఇలా ప్రధాన పార్టీలన్నీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ముందుగానే సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నాయి. ఇదిలా ఉండగా పలువురు ఆశావహ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో.. 4 నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందగా, రెండింట బీఆర్ఎస్, ఒక్క నియోజక వర్గంలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 35.92 శాతం ఓట్లను సాధించగా.. బీజేపీ 34.64 శాతం, కాంగ్రెస్ 19.47 శాతం ఓట్లను దక్కించుకున్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లా రాజకీయాల్లో భారీ మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి. పలువురు ముఖ్యనేతలు పార్టీలు ఫిరాయించడంతో అంచనాలు తలకిందులయ్యాయి. ఎన్నికల వరకు మరిన్ని సమీకరణలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం



పాత్రలో ఎత్తిన వడగండ్లు ఇలా..

బజార్‌హత్నూర్‌లో వడగండ్ల వాన

బజార్‌హత్నూర్, మార్చి 16: మండలంలోని పలు గ్రామాలలో సాయంత్రం ఈదురు గాలులలతో కూడిన రాళ్ల వాన కురిసింది. యాసంగీ పంటలైన మొక్కజొన్న, జొన్న, పంటలు ఈదురుగాలులకు నేలకొరగడంతో కొంతవరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

లోక్ అదాలత్‌లో 189 కేసుల పరిష్కారం : సివిల్ జడ్జి

ఉట్నూర్, మార్చి 16: రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆదేశాలు మేరకు శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 189 కేసులు పరిష్కరించడం జరిగిందని ఉట్నూర్ మండల న్యాయసేవ సంస్థ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ తెలిపారు. పరస్పర అంగీకారంతో 18 కేసులు, 35 బ్యాంకు కేసులు పరిష్క రించి రూ.35.80 లక్షలు సెటిల్మెంట్ చేశామన్నారు. 189 కేసులను రాజీద్వారా పరిష్కరించడం జరిగిందని తెలపారు. అదేవిధంగా ఎస్‌టీసీ కేసులు 94 పరిష్కరించామని ఆయన పేర్కొన్నారు.

'ఒత్తిడికి గురికావొద్దు'

నేరడిగొండ, మార్చి 16: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ రాంనరేష్ అన్నారు. శనివారం మండలంలోని బుగ్గారాం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షలో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కలశ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ, మార్చి 16: హనుమాన్ ఆలయ కలశ పూజా కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొన్నారు. నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ గ్రామంలో నిర్వహించిన ఆంజనేయ స్వామి ఆలయ కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కలశ పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు
- జిల్లా కలెక్టర్ రాజార్షిషా



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా



బజార్‌హత్నూర్ మండలం జాతర్లలోని పరీక్షా కేంద్రం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 16: ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజార్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శనివారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయని, ఈసారి నిమిషం నిబంధనలను ఎత్తి వేయగా.. ఐదు నిమిషాల వరకు విద్యార్థులను అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పేపర్ లీకేజీ వంటి పరిణామాలు జరుగకుండా గట్టి చర్యలు చేపట్టాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం, జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. ఇన్విజిలేటర్స్ ఉదయం 8గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకుని అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు బ్లూ, బ్లాక్ పెన్స్ మాత్రమే వాడాలని, ఓఎంఆర్ షీట్స్ విద్యార్థులకు అందించే సమయంలో జాగ్రత్త పాటించాలన్నారు. సీసీ కెమెరా ఫుటేజ్ రికార్డు అవుతుందా? లేదా? చెక్ చేయాలని, పరీక్షలకు సంబంధించిన ప్రతిదీ సీసీ కెమెరాల సమక్షంలోనే జరగాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పరీక్ష కేంద్రాలలో తాగునీరు ఫర్నిచర్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలన్నారు. మాల్ ప్రాక్టిస్ జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. హాల్‌టికెట్ తీసుకోని వారు వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాలలోకి విద్యార్థులు, అధికారులు పరీక్షల సిబ్బంది ఎవరు కూడా పరీక్ష కేంద్రాలలోకి మొబైల్స్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. పరీక్షలు పూర్తయ్యాక ప్రశ్న పత్రాలను పోలీసు బందోబస్తుతో తరలించాలని, పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన అన్ని మందులతో పాటు వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో సహా వైద్య బృందాల ఏర్పాటు, అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాను అందించాలని, సకాలంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థుల సౌకర్యాలతో బస్సు లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. ఈ పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖల అధికారులు, ఇన్విజిలెటర్లు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఆర్డీవో, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్‌లో రెండు పరీక్షా కేంద్రాలు

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో(బాలుర) ఒక పరీక్ష కేంద్రంను, మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో, మరోక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మండల ఇన్‌చార్జీ విద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు 50, ఆదర్శ పాఠశాల విద్యార్థులు 89, కేజీబీవీ విద్యార్థులు 20, ఉన్నత పాఠశాల విద్యార్థులు 9, మొత్తం 215 మంది విద్యార్థులకు 9 గదులలో 15మంది సిబ్బందితో పరీక్షల నిర్వాహణకు కావల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. జాతర్ల ఆశ్రమ పాఠశాల పరీక్షాకేంధ్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల(భూతాయి) విద్యార్థులు 18, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (దేగామ) విద్యార్థులు 33, ఆశ్రమ పాఠశాల మాడగూడ విద్యార్థులు 57, ఆశ్రమ పాఠశాల జాతర్ల విద్యార్థులు 38 మొత్తం 146 మంది విద్యార్థులకు 12మంది సిబ్బందితో పరీక్షల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశామని ఎంఈవో తెలిపారు. పరీక్షాకేంధ్రంలో మంచి నీటి సౌకర్యం, ఫ్యాన్లు, ఫర్నిచర్, సీసీ కెమెరాలతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సీసీ కెమెరా పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలు తెరువనున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఎవరికీ సెల్‌ఫోన్లు అనుమతి లేదన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దన్నారు. పీజీ హెచ్‌ఎం చందన్‌ను ఆదర్శపాఠశాల పరీక్ష కేంద్రం సీఎస్‌గాను, పీజీ హెచ్‌ఎం నరేష్‌ను ఆశ్రమ పాఠశాల సీఎస్‌గా విధులు నిర్వహిస్తాన్నారన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రాంభమవుతుందని, అలాగే 12.30 గంటలకు పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు.



బజార్‌హత్నూర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎస్ చందన్, సిబ్బంది

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్	సహర్
సా.6.32	ఉ.5.00



నిందించే.. హేళన చేసే.. చాడీలు చెప్పే ప్రతీవాడికి వినాశనం తప్పదు.

బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికే కవిత అరెస్టు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం
- కలెక్టర్ చౌక్‌లో రాస్తారోకో
- బీజేపీ దిష్టిబొమ్మ దహనం



ఆదిలాబాద్‌లోని కలెక్టర్‌చౌక్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న క్రమంలో తెలంగాణలో ప్రజాధారణ పొందుతున్న బీఆర్ఎస్‌ను మానసికంగా దెబ్బతీయడానికే ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం పార్టీ కార్యాలయం నుంచి నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కలెక్టర్‌చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ ఫ్లెక్సీని దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సీఎం కేసీఆర్‌ను బయపెట్టలేరన్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌ను తక్కువ చేయడానికే ఇన్నేళ్లైగా లేని కేసులు ఇప్పుడు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దర్యాప్తు సంస్థలను చేతుల్లో పెట్టుకొని బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు బీఆర్ఎస్‌తో ఉన్నారని, ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమేష్, నాయకులు సెవ్వ జగదీశ్, రోకండ్ల రమేష్, భరత్, రాము, రంగినేని శ్రీనివాస్, ప్రహ్లాద్, పర్వీన్, పవన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: బీఆర్ఎస్ పిలుపు మేరకు ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జైవంత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్‌లు మాట్లాడుతూ కవిత అరెస్టును ఖండిస్తున్నామన్నారు. ఇందులో వైస్ ఎంపీపీ బాలాజీ, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, సింగరేభారత్, మంగం విషంరావు, సిడాం సోనేరావు, రాథోడ్‌శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు : ఎమ్మెల్యే అనిల్

గుడిహత్నూర్: బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదురుకొనలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని, ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఎమ్మెల్యే పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదురుకునే దమ్ము లేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ అధికారులతో కవితను అరెస్టు చేయడం దారుణమన్నారు. తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో మహిళలను ఏకం చేసి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కల్వకుంట్ల కవితపై ఎలాంటి ఆదేశాలు లేకుండా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించడమేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, ఎంపీటీసీ సాగీర్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు జాదవ్ సునీత, తిరుమల్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జాదవ్ రమేష్, కేంద్రే వెంకట్రావ్, జాదవ్, భీంరావు, దోమకొండ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.